# పొట్టగంజోడు-మా నాయిన!

## ఎలికట్టె శంకర్‌రావు

మా నాయిన యిల్లుటం వొచ్చిందు గని సుకం ఎన్నడు తగలబడ్డది ఆయిన పానానికి? కన్నగల్ల శెరలు కడుపుల కడుపుల్నే దిగమింగిండు. ఈ యెదవ ఇల్లుటం యెందుకొస్తిరా బగమంతుడా కలో గంజో తాగి పుట్టినింట్లె వుండకా అని కోటిన్నఒక్కసార్లు అనుకొని వుంటడు.

మా నాయిన యిల్లుటం వొచ్చినప్పుడే ఆవేవాన్ని పొలిమేర కట్టకింద బొందబెట్టి వొచ్చినట్లుంది. ఎంత లావు గొడవైనా సరె వో... అని బజారుకెక్కి నోరు పారేసుకోలే. ఒర్సుకొని పోవటమే. మరీ మా పాలోల్ల ముందలనయితే (మామ్మ శిన్నాయినలు, కొడుకులు-బూమిపాలోల్లు) పురుగుకంటే అద్వాన్నమయిపోయిండు.

ఆయిన ఇల్లుటం రాబటికేగా, ఆల్లకు మా తాత బాగం దక్కలేదు. (మా తాతలు - మామ్మ తండ్రి, శిన్నాయినలు, పెదనాయినలు అయిదుగురయితే యిద్దరికి పిల్ల జల్ల లేకపోతే మిగతా యిద్దరు ఆ వాటాలు వాల్సుకుండ్రు. మా నాయిన వొచ్చినందుకే మా తాత వాట దక్కలేదని ఆల్ల కడుపుమంట).

మా అమ్మ నాయిన బరాబరు సరివాటా మీద కూసున్నా మాకు మాత్తరం బూములు సమానంగా రాలే. నాలుగుసోట్ల బూములున్నా మా వాటాకు మాత్తరం అయిదు గుంటలో, పది గుంటలో గని తక్కువనే వుండేది. మా నాయిన 'ఇదేం వాటా? ముష్టివాటా. సరిగ్గా వుందా కొల్సురి' అని యెన్నడన్న తట్టుకోలేక అంటే,

'పోరా పొట్టగంజోడా! నీకు సరి వాటా యేందిరా? పుక్కడికి వొచ్చి నోనివి. నువ్వేమన్న యేనెపెల్లోనికి పుట్టినావురా?' అని మా నాయిన గుండెల్ల గడ్డపారలు దిగేసెటోల్లు.

మా నాయిన యవారంల కూసొని యెంతసేపైనా యివురంతోని వోర్సుగా మాట్లాడితోడుగాని పొట్టగంజోడా అనంగనే మాత్తరం గిజగిజలాడిపోయెటోడు. ఇంటికి వొచ్చి కుక్కిమంచంల పండుకొని పైన సాయమాను దిక్కు సూస్కుంట కూదునీల్లు ముట్టకపోయెటోడు.

మామ్మ కడుపు యెగిసిపడుతుంటె గుడ్లల్ల నీల్లు కుక్కుకుంట ఆ మంచం చుట్టే గుండె బలిగినన కోడిపిల్లోలిగ తిరిగేది.

అప్పుడు నిజంగా మా తాత గనుక నా కంట పడితె ముక్కుమొకం జూడకుంట అంట బెరకాలన్నంత కోపం పీకల్దాకా వొచ్చేది నాకు. కాకపోతే ఆ నా కొడుకు నన్నెత్తుకొని శిన్నప్పుడు నాలుగు దినాలు ఆడించిండో లేదో ఆడుతూ పాడుతూనే సదురుకుండంట. లేకపోతే ముండ నాకొడుక్కు యింత శాంతనమా?

ఆడ మొగ కలిపి వో అరడజను మందిని కన్నడా! సరే ముగ్గురు ఆడపిల్లలనయితె అంతకు దగ్గ బొంతల జూసి అంటగట్టిండు. అది బానేవుంది గాని తక్కిన మొగ పోరగాల్లకు నెత్తిన నాలుగిత్తులేసి ఇంటిపట్టున బెట్టుకొని వున్న రొండెకరాలను మూడుముక్కలు జెయ్యాల్నా? అహ... శెయ్యలే. శెయ్యకుంట మా నాయినను,

పెద్దోడు లింగయ్య అయితెనే నాలిక శేత బట్టుకునే మనిసి. దూరం పోయినా నెగ్గుకొస్తడని మా నాయిన పుట్టినూరు కల్లెలపాలేనికి నలబయి మైల్ల దూరాన వున్న యెర్రగూడేనికి నెత్తిన యిత్తులు దులుపుకోకముందే యెడ్లబండి యెక్కించి 'యిల్లుటం పోరాకొడుకా' అన్నడంట.

అంతటితోనన్న వూకోవాల్నా? వూకోలే. మా పెదకక్కయ్యను గూడా వున్నాలైనే మా నాయినకు సూసినట్టే యింతంత పతేర వుండి బొమ్మర్దులంటోలులేని ముండమోపి సమందంజూసి 'నువ్వు యిల్లుటం పోరా నారయా' అన్నడంట. మా కక్కయ్య గూడా మా నాయినోలిగనే కింద మీద మూసుకొని తండ్రిమాట జెవదాటని రాములోరోలిగ గడప దిగిండంట.

మా తాత మాత్తరం 'వున్నొక్క కొడుక్కు రొండెకరాలు అప్పగించి, యిద్దరు కొడుకుల దూరం జేసుకుంటి గదరా దేవుడా అని దశరథ మారాజోలిగ కుమిలి కుమిలి పోయిండంట ఆయిన పొయ్యేదాంక.

మా తాతకు- అమ్మతండ్రికి-ఇద్దరు ఆడపిల్లలు, వో మొగ పోరగాడు కలిగిండ్రంట. పోరగాడు మీసకట్టు రాకముందే గత్తర్ల కొట్టుకపోయిండంట. మా తాత లబో దిబోమని- యెట్లనో దిగమింగి వో అంబేదగాన్ని జూసి- మా నాయినను-మామ్మకు అంటగట్టి యింట్లె బెట్టుకుండు. అప్పటికే మా పెద్దమ్మకు పతానం జేసి అత్తగారింటికి సాగనంపిండు.

మా నాయినొచ్చి యేడాది రొండేండ్లు దాటకముందే కర్రునాగలి వొప్పజెప్పి మా తాత కట్టెబొడ్సుకుంట కాస్లాలగడ్డకు పోయిండంట. మా నాయిన 'ముసలోడున్నప్పుడే యీ నా కొడుకులు- బూంపాలోల్లు- గొరగానిస్తలేరు. ముంగలపొంటి యెంత పొడుసుక తింటరో?' అని గుండె బలిగి ఆగమ్మ పచ్చోలిగ తల్లడిల్లిండంట.

దానెమ్మ కడుపుగాల తప్పుద్దా అని మా నాయిన తల్కాయ వొంచుకొని ఆరున్నొక్క మందిని- మమ్ములు- సాకుతుంటె యాన్నుంచో మా పెద్దమ్మ వూడిపడ్డది వో పొద్దు. మా పాలోల్ల యిండ్లల్ల ముకాం బెట్టి 'తియ్ నాకు వాటా. నేను పుట్టలేదా ఆ నా కొడుక్కు? నువ్వొక్కనివే యెందుకు తినాలె కుప్ప మీద కూసొని?' అని బజాట్లె పడ్డది.

మా నాయిన బిత్తరబోయి యాపశెట్టుకింద కూసున్న పెద్ద మనుసుల ముంగల కూసుండు. అప్పటికే బతికుండాల్సిన పెద్ద మనుసులు సచ్చి, సచ్చిన పెద్ద మనుసులు బతికి రాజ్జెమేలుతుండ్రు. మా నాయినకు మొండిశెయ్యే సూచిచ్చిండ్రు. యెట్లరా బగమంతుడా యింత మంది పిల్లల బెట్టుకొని యే యెండిపోయి బాయిల దూకుదుంరా అని మాఅమ్మ నాయినలు వోలమీదోలు బడి సోకాలు బెడుతుంటె పక్కూరి రెడ్డిదొర సైమానికి దంటబడి ఆల్లకింత గడ్డిబెట్టి పంపి మా అమ్మనాయినల వొడ్డున బడేసిండు.

సింగిల్ పేజీ కథ



మా నాయిన బతికినన్నాల్లు సర్కసుతాడు మీద నడిసినట్టే పానం వుగ్గబట్టుకొని బతికిండు. ఆయన బాటపొంటి పోతున్నా మనాదిబడి యేల్లతో గాల్లె గీతలు గీస్కుంట పోయెటోడు. మా నాయినను బతికున్నంతకాలం వొక్క యెండకాలం కూడా (తీరిక దొరుకుద్దని యెండకాలమే పతానాలైనా పంచాయితీలైనా పెద్దరు) యింటి పట్టున నిమ్మలంగ వుండనీయలె మా పాలోల్లు. మా నాయిన యే మూర్తంల యెర్రగూడేన కాలుబెట్టిండోగాని అయిన పోయిన్నాడే తుర్తిగా గుండెలమీన శెయ్యేసుకొని పండుకుండు. మా నాయిన మంచంల పడ్డప్పుడు సూసిపోవటానికని వోనాడు మా నారయ్య కక్కయ్య వొచ్చిండు. 'పానం యెట్లుందే అనా. వొల్లు తేలిక బడ్డదా?'అని ఉపసమ్మతి మాటలు మాట్లాడిండు కంటతడిపెట్టుకుంట. మా నాయినతోనే గడిపిండు అయ్యాల సాంతం.

తెల్లారి పోత పోత మా నాయిన పక్కన మంచంమీద కూసొని 'శెల్ప తిగాన్ని-మా కక్కయ్య రొండో కొడుకు-యిల్లుటం తోలమని అడుగుతుండ్రే అనా' అన్నడు. పెద్దోడు గదా వో మాట జెప్పుదామని.

అంతే...మా నాయిన గబుక్కున లేసి 'థూ...నీ యవ్వ యిల్లుటం పోవటమంత థుండతనమున్నాదిరా? నూస్త స్తూ పోరగాని బతుకుగండం జేస్తావురా? అంతకు బతకలేకపోతే అడుక్కతినో జీతముండో బతుకుతరుగని ఆ వొట్టలు కొట్టిన బతుకెందుకురా? ఆఖ్ థూ..అని కాండ్రించి వూసిండు.